సాక్షి
వికారాబాద్
ఆదివారం । 26 । నవంబర్ । 2023



ఓట్ల పండుగకు రండి!

పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసేందుకు నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. 6లో ▸



ఆరు గ్యారంటీలు బూటకం

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు బూటకమని బీఆర్ఎస్ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్‌రెడ్డి ఆరోపించారు. 6లో ▸



సీఎంకు వినతి..

దోమ మండలంలో 36 పంచాయతీ ఉన్నందున కొత్త మండలం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. 6లో ▸

న్యూస్‌రీల్

బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలి

జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మురళి



మాట్లాడుతున్న మురళి

పరిగి: అబద్ధాలు, అవినీతి పాలన సాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలను ఇంటికి పంపించాలని జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు చైతన్య బస్సు యాత్ర శనివారం పరిగి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఈ రెండు పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గాలికొదిలేసి, కేసీఆర్ కుటుంబం వేల కోట్ల కుంభకోణాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ పథకాల్లో భారీ అవినీతి జరిగిందన్నారు. ఉచిత వైద్యం, విద్యా విధానాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రంలో పేదలకు ఇళ్లు, కార్మికులకు సరైన వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని, ఆయన్ను ఇంటికి పంపాల్సిన సమయం వచ్చిందన్నారు. నల్లధనాన్ని తెచ్చి పేదలకు పంచుతామన్న ప్రధాని మోదీ ఆ మాట నిలుపుకోలేకపోయారని ఆరోపించారు. పేదల బాగోగులు పట్టించుకోకుండా బడా కంపెనీలకు రూ.16లక్షల కోట్లు మాఫీ చేసి చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మి, నాయకులు నారాయణ, పద్మజ, నైతథ గోవర్ధన్ పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

ఎస్పీ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోటిరెడ్డి

అనంతగిరి: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎస్పీ కోటిరెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూట్ మొబైల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పని చేయాలన్నారు. సున్నిత, అతి సున్నితమైన గ్రామాల్లో బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, కెమెరాలు, వీడియో రికార్డులను అనుమతించరాదని ఆదేశించారు. సిబ్బందికి ఎన్నికల విధులపై అవగాహన ఉండాలన్నారు. సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఫొటోలు, వీడియోలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ నర్సింలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.23.5 లక్షలు స్వాధీనం

పూడూరు: మండలంలోని అంగడిచిట్టంపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.23.5 లక్షలు పట్టుబడ్డాయి. చన్గోముల్ ఎస్‌ఐ గిరి కథనం మేరకు.. దోమ మండలం మోత్కూర్ గ్రామానికి చెందిన బాలరాజు, శివయ్య, నర్సింలు, రాయికంటి నాగేష్, బోయిని సారంగి, చాకలి నాగేష్ ఆర్టీసీ బస్సులో హైదరాబాద్ నుంచి పరిగి వస్తున్నారు. చిట్టంపల్లి చెక్‌పోస్టు వద్ద బస్సును పోలీసులు తనిఖీ చేశారు. వారి వద్ద రూ. 23.5 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

‘పట్నం’కు సవాలే..!

కొడంగల్‌లో తమ్ముడి గెలుపు కోసం ఆరాటం

- తాండూరులో సొంత పార్టీ అభ్యర్థి గెలుపు బాధ్యతలు
- ఈ రెండు నియోజకవర్గాలకే పరిమితమైన మంత్రి మహేందర్‌రెడ్డి
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వస్తే తప్ప పక్క నియోజకవర్గానికి వెళ్లలేని పరిస్థితి
- తాండూరులో గడప దాటిన అనుచరులు
- ఆయన భవిష్యత్‌పై జిల్లాలో చర్చ



వికారాబాద్: ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు జిల్లా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డికి సవాల్‌గా మారాయి. కొడంగల్ నియోజకవర్గంలో సోదరుడు నరేందర్‌రెడ్డి గెలుపుకోసం ఆరాటం.. తాండూరులో సొంత పార్టీ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి గెలుపు బాధ్యతలు.. దశాబ్దాల కాలంగా తాను ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్న తాండూరు నియోజకవర్గంలో ఉన్న తన అనుచరులు, పేరున్న బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు కారు దిగి హస్తం గూటికి చేరటం తదితర పరిణామాలన్నీ ఇటీవల ఆయనకు సవాల్‌గా మారుతున్నాయి. మరో పక్క వికారాబాద్ నియోజకవర్గంలో తన భార్య.. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి స్థానిక ఎమ్మెల్యేకు గతంలో తలెత్తిన వివాదాల కారణంగా ఆమె కూడా ఆ నియోజకవర్గంలో ప్రచారానికి దూరంగా ఉంటూ వస్తుండటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ హస్తం వీడి కారెక్కింది మొదలు తన ఉనికి కోసం పోటీ పడుతూ వస్తున్న పట్నంను అనూహ్య రీతిలో ప్రభుత్వ చరమాంకంలో మంత్రి పదవి వరించిన విషయం తెలిసిందే. ఆ హోదాను నెల రోజులు కూడా అనుభవించకుండానే ఎన్నికల కోడ్ రావటంతో ఆయన్ను మరిన్ని సవాళ్లు చుట్టుముట్టినట్లయ్యింది.

కొడంగల్‌లోనే మంత్రి మకాం

జిల్లా మంత్రిగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి అభ్యర్థుల గెలుపు బాధ్యతలు చేపట్టాల్సిన సమయంలో ఇప్పుడు ఓ నియోజకవర్గంలో అడపాదడపా తిరుగుతూ కొడంగల్‌కే ఎక్కువగా పరిమితం కావాల్సి వస్తోంది. కొడంగల్ అధికార పార్టీ అభ్యర్థిగా తన సోదరుడు పట్నం నరేందర్‌రెడ్డి పోటీ చేస్తుండగా ఆయనకు పోటీగా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్నారు. 2018 ఎన్నికల్లో అనూహ్య రీతిలో ఓటమిని చవిచూసిన రేవంత్‌రెడ్డి ఈ సారి తన గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అక్కడ వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్న రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన గురునాథ్‌రెడ్డిని ఇప్పటికే కాంగ్రెస్‌లో చేర్చుకోవటం ద్వారా తన బలం పెంచుకోగలిగారు. అంతటితో ఆగకుండా నియోజకవర్గంలో అనేక మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ బాట పట్టేలా చేసుకున్నారు. ఈ పరిణామాలతో నరేందర్‌రెడ్డి గెలుపు ఈ సారి కష్టసాధ్యంగా మారింది. దీంతో తీవ్రంగా చెమటోడ్చాల్సి రావటంతో మంత్రి మహేందర్‌రెడ్డి సోదరుడి గెలుపుకోసం కొడంగల్‌లోనే మకాం వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాంగ్రెస్ గూటికి అనుచరగనం

మూడు నెలల క్రితం సీఎం కేసీఆర్.. పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి కట్టబెడుతూనే తాండూరులో ఎమ్మెల్యే పైలెట్ గెలుపు బాధ్యతలు కూడా అప్పగించారు. దీంతో ఆయన తాండూరులో కూడా సమయం ఇవ్వాల్సి వస్తోంది. ఈ తరుణంలో తాండూరు నియోజకవర్గంలో ఆయన అనుచరులుగా పేరున్న వ్యక్తుల్లో మెజార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అధికార పార్టీని వీడి హస్తం గూటికి చేరటం చర్చనీయాంశం అయ్యింది. పట్నం అనుచరులుగా ముద్ర పడిన తాండూరు ఎంపీపీ అనిత, సొసైటీ చైర్మన్ రవిగౌడ్, మాజీ ఎంపీపీ బసప్ప, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రాందాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, యాలాల్ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, బషీరాబాద్ ఎంపీపీ కరుణ, పీఏసీఎస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, బషీరాబాద్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రాములు నాయక్, కోట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ మాణెమ్మ, సీనియర్ నాయకుడు కొమ్ము గోపాల్‌రెడ్డి, కోట్‌పల్లి మాజీ సర్పంచ్ శివానంద్ తోపాటు నియోజకవర్గంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు హస్తం గూటికి చేరారు. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో ఇక్కడ తాండూరులో, అక్కడ కొడంగల్‌లో తమ అభ్యర్థులను గెలిపించుకోవడం, పార్టీని ముందుకు తీసుకెళ్లడం మంత్రి మహేందర్‌రెడ్డికి పెద్ద సవాల్‌గా మారింది.



ప్రమాదానికి గురైన వాహనం



మృతుడు రమేశ్ (ఫైల్)



బోయ లక్ష్మయ్య(ఫైల్)

ఇద్దర్ని బలిగొన్న అతివేగం

వాహనం బోల్తాపడి దుర్మరణం

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ వద్ద ఘటన
- బాధితులంతా ఒకే గ్రామానికి చెందినవారు

మొయినాబాద్: అతివేగంతో వెళ్తున్న తుఫాన్ వాహనం మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు మరొకరు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తా సమీపంలో శనివారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం దామర్‌చెడ్ గ్రామానికి చెందిన చెట్టుకింది రమేశ్(35) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బోయ లక్ష్మయ్య(65)తో పాటు మరో ఆరుగురు తుఫాన్ వాహనంలో శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు బయలుదేరారు. ఉదయం 7.30 గంటల సమయంలో అతివేగంగా ప్రయాణిస్తున్న వీరి వాహనం అజీజ్‌నగర్ చౌరస్తా సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ రమేష్, లక్ష్మయ్య అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. గాయపడిన వారిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వేగంగా దూసుకొచ్చి బోల్తాపడిన తుఫాన్ రోడ్డు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఐదడుగుల దూరంలో ఆగిపోయింది. ఒకవేళ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టి ఉంటే ప్రమాద తీవ్రత అధికంగా ఉండేదని స్థానికులు పేర్కొన్నారు.

వాహనంలో బీఆర్ఎస్ కండువాలు, కరపత్రాలు

ప్రమాదానికి గురైన తుఫాన్ వాహనంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు వెళ్తున్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన అనంతరం వాహనంలో ఆ పార్టీ కండువాలు, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి సంబంధించిన ఎన్నికల ప్రచార కరపత్రాలు కనిపించాయి. ఉదయం పూట కార్యకర్తలు నగరంలో ఉండే పార్టీ నాయకులను కలిసేందుకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం.

దామర్‌చెడ్‌లో విషాదఛాయలు

బషీరాబాద్: అజీజ్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందడంతో వారి స్వగ్రామం దామర్‌చెడ్‌లో తీవ్ర విషాదం అలుముకుంది. ప్రమాదంలో గ్రామానికి చెందిన చెట్టుకింది రమేష్, బోయ లక్ష్మయ్య మృతిచెందగా జి.నర్సిరెడ్డి, రవికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు.



రామయ్యగూడలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రసాద్‌కుమార్

కేసీఆర్‌ను నమ్మితే మోసపోతాం

- కారు గుర్తుకు ఓటేస్తే ప్రభుత్వ భూములు మాయమైపోతాయి
- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- కాంగ్రెస్ వికారాబాద్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్ అర్బన్: కేసీఆర్ మాయమాటలు నమ్మి కారు గుర్తుకు ఓటు వేస్తే మనల్ని నట్టేట ముంచుతారని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని మధుకాలనీ, రాజీవ్ నగర్, రిక్షా కాలనీ, రామయ్యగూడ, ఎంఐజీ, శివరాం నగర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టో వచ్చాక కేసీఆర్‌కు గ్యాస్ సిలిండర్ ధర గుర్తుకు వచ్చిందా అనిప్రశ్నించారు. ఏడాదిగా గ్యాస్ సిలిండర్ ధర రూ.1,200 ఉందని, ఎన్నికలు రాగానే రూ. 400లకే ఇస్తానని మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే వికారాబాద్ మున్సిపల్ చుట్టూ ఉన్న వెయ్యి ఎకరాల ప్రభుత్వ, దేవాలయ, వక్ఫ్‌బోర్డు భూములు మాయమవుతాయని అన్నారు. ఇప్పటికే కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే భూముల లెక్కలు తీసిపెట్టుకున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ, పేదల భూములు పదిలంగా ఉండాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆనంద్ మాటలతో కాలం గడిపారని, మున్సిపాలిటీ అభివృద్ధి జరగకుండా చైర్‌పర్సన్‌ను వేధించారని ఆరోపించారు. ఎమ్మెల్యే కాకముందు కేవలం రెండుఎకరాల భూమి ఉన్న ఆనంద్ ఇప్పుడుమూడు వందల ఎకరాలు ఎలా సంపాదించారో ప్రజలకు చెప్పాలన్నారు. ఆయనకు ఆస్తులు సంపాదించుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. నియోజకవర్గంలో ఒక డబుల్ బెడ్‌రూమ్ ఇల్లుకూడాపేదలకు ఇవ్వలేదని ఆరోపించారు. ఎక్కడ పోయినా కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ, రాజీవ్ గృహకల్ప ఇళ్లే కనిపిస్తున్నట్లు తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న శుభప్రద్ లాంటి ఉద్యమకారుడికి సైతం తాము ఇంటి స్థలం ఇచ్చి గౌరవిస్తారని తెలిపారు. పేదలకు ఇంటి స్థలం ఉంటే రూ. 6లక్షలు నగదు, స్థలం లేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ. 5లక్షలు నగదు ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక ఇంట్లో ఒకరికే పింఛను ఇస్తోందని, కాంగ్రెస్ వస్తే ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే వారిద్దరికీ పింఛను ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలస వ్యక్తులను పారదోలాలి

- గ్యారంటీల అమలులో కర్ణాటక ప్రభుత్వం విఫలం
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇక్కడా అదే పరిస్థితి
- కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం
- బీఆర్ఎస్ వికారాబాద్ అభ్యర్థి ఆనంద్



ఎమ్మెల్యే ఆనంద్‌ను గజమాలతో సత్కరిస్తున్న నేతలు

మోమిన్‌పేట: ఎన్నికల సమయంలో వచ్చే వలస వ్యక్తులను మన ఇలాఖా నుంచి పారదోలాలని బీఆర్ఎస్ వికారాబాద్ అభ్యర్థి ఆనంద్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బాల్‌రెడ్డిగూడెం, చీమల్‌దరి, దేవరంపల్లి, చక్రంపల్లి, ఏన్కతల, టేకులపల్లి, మక్త తండా, మోమిన్‌పేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చినప్పుడే ప్రత్యర్థి పార్టీలకు ప్రజలు గుర్తుకువస్తారని అన్నారు. అలాంటి వ్యక్తులను దూరం పెట్టాలని సూచించారు. ఆరు గ్యారంటీలతో మన ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ పక్కనే ఉన్న కర్ణాటకలో ఎందుకు అమలు చేయలేదో చెప్పాలన్నారు. అక్కడి రైతాంగానికి రోజుకు 5గంటల కరెంటు మాత్రమే సరఫరా చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంటే వస్తుందని, ఈ విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. కర్ణాటకతో పోలిస్తే మన గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని, పచ్చని చెట్లతో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. హరితహారం పథకం మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. మొక్కల పెంపకంతో వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాక ముందు వచ్చిన తరువాత అభివృద్ధి ఎలా ఉందో చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని, ఇది కేసీఆర్ సాధించిన గొప్ప విజయమని పేర్కొన్నారు. ఒకప్పుడు కరెంటు కోసం పొలాల వద్ద రైతులు జాగారం చేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. వ్యవసాయానికి 24గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు చనిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదని, సీఎం కేసీఆర్ బాధిత కుటుంబాలకు రూ. 5లక్షలు ఇచ్చి ఆదుకున్నారని గుర్తుచేశారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న బీఆర్ఎస్‌కే మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు చంద్రకళ, నర్సింహారెడ్డి, అలవేలమ్మ, నవనీత, సరస్వతి, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మానస, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు కరణం రామకృష్ణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరిశంకర్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, మండల యువత అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నమ్మకానికి మోసానికి మధ్యే పోరాటం

- రేవంత్‌కు అండగా నిలవాలి
- కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: ఈ ఎన్నికలు ప్రజల నమ్మకానికి, బీఆర్ఎస్ నాయకుల మోసానికి మధ్య జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని కోస్గి పంచాక్షరీ ఫంక్షన్ హాల్‌లో వీరశైవ మహేశ్వర లింగ బలిజ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కర్ణాటక మంత్రి శరణ్‌ప్రకాశ్ పాటిల్, హుబ్లీ ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రేవంత్‌కు వీరశైవ సమాజం సభ్యులు అండగా నిలవాలని కోరారు. నమ్మకంతో విశ్వాసంతో కొడంగల్ ప్రజల కోసం పనిచేసిన రేవంత్ ఒక వైపు, అవినీతి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మరోవైపు పోటీ చేస్తున్నారని అన్నారు. రేవంత్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం మారితేనే రాష్ట్రం బాగు పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి రేవంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్‌చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు ఎనుముల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న నాయకులు

బీసీలకు రాజ్యాధికారం రావాలి

- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్
- తాండూరులో ఎన్నికల ప్రచారం

తాండూరు టౌన్: బీసీలకు రాజ్యాధికారం రావాలి.. ఆ సామాజిక వర్గం వ్యక్తి సీఎం కావడమే తమ చిరకాల వాంఛ అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద జనసేన, బీజేపీ తాండూరు అభ్యర్థి నేమూరి శంకర్ గౌడ్‌కు మద్దతుగా నిర్వహించిన సభకు హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే స్ఫూర్తిగా జనసేన పార్టీ తెలంగాణలో పుట్టిందన్నారు. అన్యాయం జరిగితే తిరగబడాలి, అవినీతి జరిగితే ఎదుర్కోవాలనే నినాదంతోనే పోరాటం చేస్తున్నామన్నారు. నాకు జన్మనిచ్చింది ఆంధ్రా అయితే, పునర్జన్మనిచ్చింది తెలంగాణ అన్నారు. పోరాట యోధుడు గద్దరన్న, మంద కృష్ణ మాదిగ, మగ్దుం మొయినొద్దీన్‌లు నాకు స్ఫూర్తి అన్నారు. సామాజిక తెలంగాణ, బీసీలకు రాజ్యాధికారం రావాలన్నదే నా కోరిక అన్నారు. ప్రధాని మోదీ తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పడంతో మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు. తాండూరు, నాగర్‌కర్నూల్ అభ్యర్థులు నేమూరి శంకర్ గౌడ్‌ను, లక్ష్మణ్ గౌడ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్, నాగర్‌కర్నూల్ అభ్యర్థి లక్ష్మణ్‌గౌడ్, నాయకులు రవి, రాము, రమేష్ కుమార్, పటేల్ జయశ్రీ, సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు సభలో ప్రసంగిస్తున్న పవన్‌కళ్యాణ్

క్లుప్తంగా

ఫ్లాగ్ మార్చ్



దౌల్తాబాద్‌లో పోలీసుల కవాతు

దౌల్తాబాద్: ఎన్నికలకు ప్రజలు సహకరించి ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కొడంగల్ సీఐ రాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలీసుల ప్రత్యేక బలగాలతో కవాతు, ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేశ్‌కుమార్, ఏఎస్‌ఐ ముత్యాలరాజు తదితరులున్నారు.

నేడు కన్హాకు ప్రధాని మోదీ

నందిగామ: మండలంలోని కన్హా శాంతివనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అతి పెద్ద ధ్యాన కేంద్రంలో హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ డీపటేల్‌తో కలిసి ధ్యానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు శ్రీరామచంద్ర షాజహాన్‌పూర్(బాబూజీ) 125వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన స్మారక ఫలకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మోదీ ఇక్కడికి రానున్నారు. ఈ నేపథ్యంలో కన్హా వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేశారు. శాంతివనంలోనికి ఎవరినీ అనుమతించడం లేదు.

రాష్ట్రం ఇచ్చినట్లే.. ఆరు గ్యారెంటీలు

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, తమిళనాడు ఎంపీ విష్ణుప్రసాద్



కేసారంలో మాట్లాడుతున్న తమిళనాడు ఎంపీ విష్ణుప్రసాద్

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్రం ఇచ్చినట్లే.. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, తమిళనాడు ఎంపీ విష్ణుప్రసాద్ అన్నారు. శనివారం ఆయన పార్టీ చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థికి మద్దతుగా మండల పరిధిలోని గొల్లగూడ, కేసారం, దామరగిద్ద, ఖానాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒకటేనని వారు పేదలకు చేసిందేమీ లేదన్నారు. దామరగిద్ద మాజీ సర్పంచ్ మధుసుధన్‌గుప్తా ఆధ్వర్యంలో భీంభరత్‌కు భారీ గజమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం భీం భరత్ మాట్లాడుతూ.. తనకు ఒక్క అవకాశం ఇస్తే అందుబాటులో ఉండి ప్రజా సేవ చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యానారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ప్రచార కమిటీ సభ్యుడు ఎస్. వసంతం, షాబాద్ దర్శన్, సర్పంచ్ రమేశ్, మాజీ సర్పంచ్ మధుసుధన్‌గుప్తా, పాండురంగారెడ్డి, ఎంపీటీసీ రాములు, సీపీఐ నాయకులు కె. రామస్వామి, మండలపార్టీ నాయకులు వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, టేకుపల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సమత, సరిత, శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య, గోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'విజయభేరి' రద్దు

షాద్‌నగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయభేరి బహిరంగసభ రద్దయింది. సభకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకావాల్సి ఉండగా ఆయన ప్రయాణించే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రాలేకపోయారు. సభకు నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్ మండలాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నేతలు, అభిమానులు తరలివచ్చారు. పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో బాలాజీ టౌన్ షిప్ ఎదురుగా ఉన్న మైదానంలో ఏర్పాటు చేసిన సభాప్రాంగణం జనంతో నిండిపోయింది. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి, జెడ్పీటీసీలు తాండ్ర విశాల, వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల పండుగకు రండి!

జంగ్ తెలంగాణ



దారి ఖర్చులిస్తాం.. కార్లు పెడతాం

- బంపర్ ఆఫర్లు ప్రకటిస్తున్న ప్రధాన పార్టీలు
- ఇప్పటికే ఆయా నగరాల్లోనూ ఆత్మీయ సమ్మేళనాలు పూర్తి
- గెలుపోటములను శాసించనున్న వలస ఓటర్లు

బతుకు దెరువుకు వలస వెళ్లిన వారు పండుగలకు ఇంటికి వచ్చే వారు ప్రస్తుతం ఓట్ల పండుగ ప్రయాణానికి సిద్ధమయ్యారు. వీరికి రాజకీయ పార్టీలు బంపర్ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ప్రయాణ ఖర్చులతో పాటుగా క్యాష్ గిఫ్ట్ ఇస్తామని తాయిలాలు ఆశ చూపుతున్నారు.

వసల కూలీలను రప్పించేందుకు సర్వే

పెద్దేముల్: పోలింగ్ సమయం దగ్గర పడుతుండడటంతో వివిధ పార్టీల నాయకులు గ్రామాలల్లో వలస కూలీల సర్వే ప్రారంభించారు. ఏ గ్రామం నుంచి ఎంత మంది కులీలు వెళ్లారు. ఎక్కడెక్కడ ఉన్నారన్న దానిపై ఇంటింటా తిరుగుతూ వారిని ఎలా తీసుకరావాలనే దానిపై ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి, దుగ్గాపూర్, పెద్దేముల్‌తండా, బాయిమీదితండా, ఊరేంటితండా, మారేపల్లి, మదనంతపూర్‌తో పాటు పలు గ్రామాల నుంచి సుమారు పదేళ్ల నుంచి కులీలు ఉపాధి కోసం ముంబాయి, పూణే, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి అక్కడనే జీవనం సాగిస్తున్నారు. వారిని స్వగ్రామాలను తీసుకువచ్చేందుకు ప్రత్యేక ప్రయత్నాలు చేస్తున్నారు.

పరిగి: ఓట్ల పండుగకు రాజకీయ నేతలు ఓటర్లను ప్రసన్నం చేసేందుకు నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ప్రత్యేక వాహనాల్లో రావాలని పిలుపునిస్తున్నారు. ఇందుకు ప్రయాణఖర్చులు, ఓటుకు ఇంత రేటు కట్టించేందుకు యత్నిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

పోలింగ్ కోసం ప్రత్యేక టీం

పరిగి నియోజకవర్గంలో మొత్తం ఏడు మండలాలుండగా.. పరిగి, పూడూరు, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్, గండీడ్, మహ్మదాబాద్ మండలాలున్నాయి. నియోజకవర్గంలో 2,59,422 మంది ఓటర్లుండగా అందులో దాదాపుగా 20వేల మందికి పైగా ఓటర్లు పూణే, బొంబాయి, హైదారాబాద్ నగరాల్లో జీవిస్తున్నారు. అందులో ఎక్కువగా ఉమ్మడి కుల్కచర్ల, గండీడ్ మండలాలతో పాటుగా దోమ మండల వాసులుంటారు. పూణేలో ఉన్న ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రత్యేక సమావేశాలు పూర్తిచేశారు. ప్రతీ ఒక్కరు తమ ప్రాంతాలకు వచ్చి పోలింగ్‌కు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని వాటి ఖర్చులన్నీ తామే భరిస్తామని భరోసా కల్పించారు. ప్రస్తుతం నాయకులంతా వలస వెళ్లిన వారి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ఎంత మంది వస్తారు.. వచ్చిన వారు ఎంత మేర లాభపడుతారనే లెక్కలేసుకుని తీసకువచ్చేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికే వారికి ఫోన్ చేసి వారిని రప్పిచేందుకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు ఒకరికంటే ముందు మరొకరు సంప్రదించి మాట తీసుకుంటూ వచ్చి తమ పార్టీకే ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు.

ప్రత్యేక వాహనాలు, విందు

ఒకే కుటుంబంలో ఐదు నుంచి ఆరు ఓటర్లు ఉన్న వారికి ప్రత్యేక వాహనాలు సమకూర్చుతున్నారు. నగరాల నుంచి వచ్చే వారికి రవాణ ఖర్చులు భరిస్తామని హామీ ఇస్తున్నారు. పలువురు పోలింగ్‌కు వచ్చేందుకు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించి పోలింగ్‌కు వచ్చిన తర్వాత మరింత ఇస్తామంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారని పలువురు వెల్లడిస్తున్నారు. వచ్చిన వారికి మందు, విందు ఏర్పాటు చేసి వారి ఓట్లను గంపగుత్తగా వేసుకునేందుకు సన్నహాలు చేస్తున్నారు. వలస ఓటర్లే ఓటింగ్‌లో పాల్గొంటే గెలుపును ప్రభావితం చేసేందుకు వీలుంటుంది.

ప్రతీ ఓటు కీలకమే

పరిగి అసెంబ్లీ సెగ్మెంట్ ఎన్నిక రసవత్తంగా మారింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రతీ ఒక్క ఓటు కీలకం కానుంది. పోలింగ్ తగ్గితే భవితవ్యం మారుతుందని నాయకులు భావిస్తున్నారు. వలస ఓటర్లను తమ వైపు మలుచుకునేందుకు అన్ని పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. దూరప్రాంతాల వారిని రప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

'చేతి'లో చెయ్యేసి..



ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బషీరాబాద్ ఎంపీపీ కరుణ తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డికి మద్దతుగా క్యాద్గీరా, గంగ్వార్, అల్లాపూర్‌లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు చేతిలో చేయేసి కాంగ్రెస్‌కే మా ఓటు అంటూ భరోసా ఇచ్చారు. – బషీరాబాద్

ఓటేసిన పోలీసులు



బొంరాస్‌పేట పోలీసులు పోస్టల్ బ్యాలెట్ విధానంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్‌ఐ శంకర్‌తో పాటుగా వెళ్లి వారు ఓటేశారు. మిగిలిన వారు ఆదివారం ఓటేయనున్నారు. – బొంరాస్‌పేట

ఆరు గ్యారెంటీలు బూటకం

బీఆర్ఎస్ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు బూటకమి బీఆర్ఎస్ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన మహ్మదాబాద్ మండల పరిధిలోని గధిర్యాల్, చౌదర్‌గూడెం, మంగంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో హామీలు ఇచ్చి అమలు మరిచారన్నారు. అరవై ఏళ్ల దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో రాష్ట్రంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ప్రజలు జీవన విధానం మారిందన్నారు. రైతులకు, నిరుపేదలకు అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి సీఎం కేసీఆర్ వస్తారని ప్రజలకు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే సంక్షేమం



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

కాంగ్రెస్ పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన గండీడ్ మండల పరిధిలోని రుసుంపల్లి, చిన్నవార్వాల్, పెద్దవార్వాల్, వెన్నాచేడ్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ దళారులకు నిలయమని ఎద్దేవా చేశారు. ప్రతీ పథకంలో కమీషన్లు దండుకుని పేదలను దోచుకుంటున్నారని ఆరోపించారు. వారికి ఓటేస్తే అవినీతి మరింత పెరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు పథకాల అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు. తననకు ఆశీర్వదిస్తే నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. అనంతరం రుసుంపల్లి గ్రామ సర్పంచ్ శిరీష, వార్డు మెంబర్లు, ముదిరాజ్ సంఘం మహ్మదాబాద్ మండల ఉపాధ్యక్షుడు గోపాల్ తదితరులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గండీడ్, మహమ్మదాబాద్ మండలాల అధ్యక్షులు జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతిబాయి, సీనియర్ నాయకుడు నరోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సొమ్ము కొల్లగొట్టారు



ప్రచారంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, పక్కన కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్ తదితరులు

- నిధులన్నీ కేసీఆర్ కుటుంబానికే..
- అప్పుల రాష్ట్రంగా మార్చారు
- టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్ తీన్మార్ మల్లన్న

కందుకూరు: కేసీఆర్ కుటుంబం తెలంగాణ ప్రజల సొమ్ము రూ.6 లక్షల కోట్లు కొల్లగొట్టిందని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో శనివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్‌ఆర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడబిడ్డల అభయహస్తం వంటి పథకాల నిధులు రూ.13 కోట్లు కేసీఆర్ దోచుకున్నాడని ధ్వజమెత్తారు. కేసీఆర్ బిడ్డ సారా దందా చేస్తే మోదీ కాళ్లు పట్టుకుని విడిపించుకున్నాడన్నారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రానికి మిగులు బడ్జెట్ అప్పగిస్తే, అప్పుల రాష్ట్రంగా మార్చారని దుయ్యబట్టారు. ఫార్మా పేరుతో రైతుల భూములను గుంజుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దు చేసి ఎవరి భూములు వారికి అప్పగిస్తామన్నారు. మంత్రిగా ఉన్న సబితారెడ్డి ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఏం చేసిందని ప్రశ్నించారు. తెలంగాణ అంతటా కాంగ్రెస్ గాలి వీస్తోందని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేఎల్ఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. గడీలు, దొరల పాలనను గుర్తు చేసేలా ఎవరినీ కలవకుండా, ప్రజలను పట్టించుకోకుండా ఫాంహౌస్‌కే సీఎం కేసీఆర్ పరిమితమయ్యారని కేఎల్‌ఆర్ విమర్శించారు. తనను గెలిపిస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేసే బాధ్యత నియోజకవర్గంలో తనదేనన్నారు. కాగా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కృపాకర్‌రెడ్డి, నాయకుడు మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేశ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ డి.జంగయ్య, నాయకులు మదన్‌పాల్‌రెడ్డి, జగదీష్, కృష్ణరాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు వినతి.. ఎమ్మెల్యేకు తలనొప్పి

- దాదాపూర్‌ను మండలం చేయాలని కేసీఆర్‌ను కోరిన మహేశ్‌రెడ్డి
- దిర్సంపల్లినే చేయిస్తానని జెడ్పీటీసీ సభ్యుడి హామీ



దిర్సంపల్లి హనుమాన్ ఆలయంలో ప్రమాణం చేసి మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు నాగిరెడ్డి

దోమ: మండల పరిధిలో 36 పంచాయతీలుండగా కొత్త మండలాల ఏర్పాటుకు పంచాయితీ తెరపైకి వచ్చింది. మాగ్రామమే మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని దాదాపూర్, దిర్సంపల్లి గ్రామాల నేతలు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో దాదాపూర్ వచ్చిన ఎమ్మెల్యేకు తమ గ్రామాన్ని మండలం చేయాలని విన్నవించారు. ఈ క్రమంలో ఈ నెల 22న పరిగి ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్‌ను దాదాపూర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బహిరంగంగా కోరారు. దీంతో దిర్సంపల్లి గ్రామస్తులు, నేతలు ఈ నెల 23న రోడ్డెక్కారు. ఎమ్మెల్యేకు, జెడ్పీటీసీకి వ్యతిరేకంగా నినదించారు. అన్ని గ్రామాలకు అనుకూలంగా తమ గ్రామాన్ని ఎందుకు మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ప్రస్తావన తీసుకురాలేదని మండిపడ్డారు.

హనుమాన్ ఆలయంలో ప్రమాణం

దిర్సంపల్లి గ్రామస్తులు రోడ్డెక్కిన విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి నచ్చజెప్పేందుకు యత్నించారు. గ్రామస్తులు మొండికేయడంతో ఎమ్మెల్యే కాళ్లు పట్టుకోనైనా మండల ఏర్పాటుకు కృషి చేస్తానని గ్రామస్తులు, నేతలకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో పూజలు చేసి మండల ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రమాణం చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అటు ఎమ్మెల్యే దాదాపూర్ గ్రామ ప్రజలకు హామి ఇవ్వగా, ఇటు జెడ్పీటీసీ దిర్సంపల్లి గ్రామ ప్రజలకు వేరువేరుగా హామీ ఇవ్వడంతో ఏ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయిస్తారోనని ఆయా గ్రామాల ప్రజలు, నేతలు చర్చించుకుంటున్నారు.

దేశానికి ప్రమాదకరం బీజేపీ

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఇబ్రహీంపట్నం: మతోన్మాద బీజేపీ దేశానికి ప్రమాదకరమని, ఆపార్టీని ఈఎన్నికల్లో ఓడించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో శనివారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ పట్ల బీఆర్ఎస్ తన స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీని నిరోధించేందుకు ఇండియా కూటమిగా ఏర్పడితే అందులోని భాగస్వామ్య పార్టీలతో కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దేశంలో ఏ పార్టీ గెలిచినా ప్రాంతీయ పార్టీలు కీలక పాత్ర పోషిస్తాయని సీఎం కేసీఆర్ అంటు న్నారని.. అయితే కేంద్రంలో బీజేపీ కాని ఇండియా కూటమీ గాని అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ దేనికి మద్దతునిస్తుందో స్పష్టం చేయాలన్నారు. కేసీఆర్ వ్యవహారశైలి బీజేపీకి మద్దతిచ్చేలా ఉందన్నారు. రాష్ట్రంలో సీపీఎం 19, ఒక్క స్థానంలో సీపీఐ, కొన్ని స్థానాలల్లో వామపక్ష శక్తులు పోటీ చేస్తున్నాయని.. ఆయా పార్టీలకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

దొరల పాలనకు చరమగీతమే..

- నమ్మి ఓటేసిన ప్రజలను కేసీఆర్ మోసం చేశారు
- మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

అనంతగిరి: కేసీఆర్‌ను నమ్మి ఓటేస్తే మూడెకరాల భూమి రాలేదు.. నిరుద్యోగులకు రూ.3016 భృతి ఇవ్వలేదని మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎస్ డీఎఫ్, జాగో తెలంగాణ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటర్ల చైతన్య యాత్ర శనివారం వికారాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో ఆకునూరి మాట్లాడుతూ.. మద్యానికో, కులానికో, నోటుకో, మతానికి లోబడకుండా ఓటేయాలన్నారు. కేజీ టూ పీజీ నాణ్యమైన విద్య నేడు రాష్ట్రంలో ఎక్కడ అమలవుతుందో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. సంపద గల తెలంగాణ నేడు అవినీతి పాలనతో కూరుకుపోయిందని ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇవ్వలేదన్నారు. పేపర్ లీకేజీల పేరిట టీఎస్‌పీఎస్సీని భ్రష్టు పట్టించి నిరుద్యోగుల జీవితాలతో చలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు డిజైన్‌లు మార్చి అవినీతికి పాల్పడ్డారన్నారు. తెలంగాణలో అవినీతి ఆర్థిక దోపిడి రాజకీయాలను, అదాని, అంబానీలకు సేవ చేస్తున్న వారిని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకురాలు గీత, మహేందర్ పలువురు నిరుద్యోగులు పాల్గొన్నారు.

'పోస్టల్' కష్టాల్

చేవెళ్ల: ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిన ఎలక్షన్ కమిషన్ బ్యాలెట్ పేపర్లు అందిచడంలో తాత్సారం చేసింది. దీంతో ఎన్నికల శిక్షణకు హాజరైన ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన శనివారం చేవెళ్ల ఎన్నికల రిట్నింగ్ కార్యాలయం పరిధిలోని శ్రీచైతన్య కళాశాల శిక్షణ కేంద్రం వద్ద చోటు చేసుకుంది.

300 మంది ఉద్యోగస్తుల లిస్ట్ ఆలస్యం

జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు చేవెళ్ల నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయించారు. వారికి శనివారం శిక్షణ పూర్తైన వెంటనే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని ముందుగానే సమాచారం ఇచ్చారు. శిక్షణకు వచ్చిన వారికి మాత్రం పోస్టల్ బ్యాలెట్ పేపర్లు రాలేదు. ఇదే విషయమై చేవెళ్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని ప్రశ్నించగా.. మీ సొంత నియోజకవర్గాలనుంచి రావాలి.. అక్కడి నుంచి రాలేదు.. అక్కడే అడగండి సమాధానం ఇచ్చారన్నారు. నియోజకవర్గాల్లో అడిగితే ఎన్నికల విధులు నిర్వహించే దగ్గరే పోస్టల్ బ్యాలెట్ ఇస్తారని చెప్పారు. వీరి సమాధానాలతో విసిగిన ఉద్యోగస్తులు కావాలనే అధికారులు పోస్టల్ బ్యాలెట్‌లు ఇవ్వకుండా చేశారని ఆరోపించారు. మా జాబితా లేకపోతే శిక్షణకేంద్రానికి ఎలా వస్తామని ప్రశ్నించారు. దీంతో పోస్టల్ బ్యాలెట్‌లు అందని పరిగి, కొడంగల్, తాండూరు, చేవెళ్ల, ఎల్బీనగర్, వనపర్తి, కూకట్‌పల్లి తదితర నియోజకవర్గాలనుంచి వచ్చిన 300 మంది ఉద్యోగులకు పోస్టల్‌బ్యాలెట్‌లు రాకపోవడంతో ఆందోళన చేపట్టారు. పోస్టల్ బ్యాలెట్‌లు ఇవ్వకుంటే ఎన్నికల విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి అందుబాటులో లేక ఆయన వచ్చే వరకు ఆందోళన చేస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు లిస్ట్ వచ్చిందని పోస్టల్‌బ్యాటిల్‌లు ఇచ్చారని ఇది కావాలనే చేశారని ఉద్యోగులు ఆరోపించారు.

ఎలక్షన్ కమిషన్‌పై చర్యలు తీసుకోవాలి

హుడాకాంప్లెక్స్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న తమకు పోస్టల్ బ్యాలెట్ రాకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు 3వ విడత ట్రెనింగ్ సెషన్ హుడాకాంప్లెక్స్ జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. శిక్షణ అనంతరం ఓటు వినియోగించుకోవాలన్న ఉపాధ్యాయులు తమకు బ్యాలెట్ రాలేదని ఆందోళన చేపట్టారు. తమకు ఓటు హక్కు కల్పించకపోతే ఎన్నికల విధులు బహిష్కరిస్తామని అధికారులను హెచ్చరించారు. పోస్టల్ బ్యాలెట్ రాకపోవడంపై తమకు ప్రభుత్వంపై అనుమానం ఉందని ఉపాధ్యాయులు ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

లిస్ట్ రాక ఆలస్యం

చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్‌బ్యాలెట్‌ల జాబితా అందరివీ అందలేదు. ముందుగా వచ్చిన లిస్ట్ ప్రకారం అందించాం. లిస్ట్‌లో పేర్లు రాని వారివి ఆపడంతో వారు ఆందోళన పడ్డారు. మళ్లీ ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో మాట్లాడి లిస్ట్‌ను తెప్పించుకుని అందరికీ పోస్టల్ బ్యాలెట్‌లు అందించాం.

– కృష్ణయ్య, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి